

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి హరిప్రియానాయక్

# ప్రజలు అభివృద్ధి వైపే నిలిచారు

- **అందుకే ఇల్లెందు గడ్డపై గులాబీ జెండాయే ఎగురుతుంది**
- **శ్రమించిన శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు: హరిప్రియానాయక్**

ఇల్లెందు, డిసెంబర్ 2: ఎవరెన్ని కుట్రలు చేసినా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి వైపే నిలిచారని బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ పేర్కొన్నారు. ఎవరెన్ని కుతంత్రాలకు పాల్పడ్డా ఇల్లెందు గడ్డపై గులాబీజెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇల్లెందు పాత బస్టాండ్ వద్ద నున్న పార్టీ ఎన్నికల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో 70 ఏళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించానని అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.18 వేల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని వివరించారు. ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డానని అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు తోడునీడగా నిలిచానని అన్నారు. మూడు రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో అనేకమంది ప్రజలు పార్టీలకు అతీతంగా, ప్రలోభాలకు గురికాకుండా ముందుకు వచ్చి బీఆర్ఎస్‌లో చేరారని, తనను గెలిపించుకోవాలనే తపనతో పని చేశారని వివరించారు. పార్టీపై నమ్మకంతో నియోజకవర్గ వ్యాప్తంలో కాంగ్రెస్, ఎన్‌డీ సహా ఇతర పార్టీల నుంచి వందలాది మంది ప్రజలు వచ్చి బీఆర్ఎస్‌లో చేరారని అన్నారు. ఈ క్రమంలో కొంతమంది ఎన్నికల సమయంలో అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు అమ్ముడు పోయి ఆయనకు దగ్గరకు చేరారని విమర్శించారు. అయినా, పార్టీని ఏమీ చేయలేరని అన్నారు. చివరి నిమిషం వరకూ పార్టీ విధానాలకు కట్టుబడి పనిచేసిన శ్రేణులు, ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా బాధ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఇల్లెందులో ముమ్మాటికీ బీఆర్ఎస్సే గెలవబోతున్నదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, జేకే శ్రీను, బబ్లూ, శీలం రమేశ్, జానీపాషా, ప్రమోద్, ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, రమేశ్, మురళి, కృష్ణారావు, రవితేజ, గుండా శ్రీకాంత్, సన రాజేశ్, హరికృష్ణ, గిన్నారపు రాజేశ్ పాల్గొన్నారు.

# వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

- **హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారు**
- **ఖమ్మంలో మనమే గెలుస్తాం: బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్**



ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్

ఖమ్మం, డిసెంబర్ 2: రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టంచేశారు. హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణం చేస్తారని తెల్చి చెప్పారు. ఖమ్మంలోనూ తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించడం కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఖమ్మం మమత ఆసుపత్రి ఆవరణలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో వారి మనసులు గెలుచుకొని మనం మళ్లీ అధికారంలోకి వస్తామని అన్నారు. మొదటిసారి కూడా కేవలం 63 సీట్లతోనే కేసీఆర్ అధికారంలోకి వచ్చినట్లు గుర్తుచేశారు. అప్పటి నుంచీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని, తెలంగాణను అస్థిరపరచడానికి ఎందరో ప్రయత్నించారని అన్నారు. కానీ కేసీఆర్ అలాంటి కుట్రలను ఛేదించి సువిశాల పాలన అందించారని గుర్తుచేశారు. రెండోసారి ఎన్నికల్లోనూ రాష్ట్రాన్ని విఫల తెలంగాణగా చిత్రీకరించాలని కుట్రలు చేశారని ఆరోపించారు. కానీ ప్రజలందరూ బీఆర్ఎస్‌నే ఆశీర్వదించి 88 సీట్లు అందించారని గుర్తుచేశారు. తొలిసారి గెలిచిన అనంతరం శాసనసభలో నిరంతర విద్యుత్ అందిస్తామని కేసీఆర్ చెప్పారని, రైతుల కోసం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అదే సభలో ఉన్న అప్పటి కాంగ్రెస్ నేత జానారెడ్డి కల్పించుకొని సీఎం కేసీఆర్ ప్రకటనలు ఆచరణ సాధ్యం కాదంటూ అపహాస్యం చేసిన సందర్భం రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తే ఉందని అన్నారు. 24 గంటల కరెంటు ఇస్తే తాను గులాబీ జెండా కప్పుకొని బీఆర్ఎస్‌కు అనుకూలంగా ప్రచారం చేస్తానని కూడా అన్నారని గుర్తుచేశారు. ఆ తరువాత కేసీఆర్ ప్రకటనలు, హామీలు నూరుశాతం అమలయ్యాయని గుర్తుచేశారు. కానీ గులాబీ కండువా కప్పుకుంటానన్న వాళ్లు మాయమయ్యారని విమర్శించారు. అదే నిరంతర విద్యుత్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని అన్నారు. తెలంగాణ లాంటి చిన్న రాష్ట్రంలో, అందునా కొత్త రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు మరెక్కడా లేవని అన్నారు. జీడీపీలో కూడా తెలంగాణది అగ్రస్థానమని స్పష్టం చేశారు. పంటల సాగు, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, పింఛన్లు సహా అనేక పథకాలు అందిస్తున్నది సీఎం కేసీఆర్ మాత్రమేనని వివరించారు. అందుకే మళ్లీ గెలిచేది మనమేని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యం

- **పార్టీ విజయానికి శ్రేణులు అంకితభావంతో శ్రమించాయి**
- **ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు**

ఖమ్మం, డిసెంబర్ 2: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు స్పష్టం చేశారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో శ్రమించారని అన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కష్టపడిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు, వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ నాయకులకు, నియోజకవర్గ సమన్వయ కర్తలకు జిల్లా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ అభ్యర్థులకు నిత్యం దిశానిర్దేశం చేస్తూ, ఎన్నికల ప్రక్రియలో వెన్నుదన్నుగా నిలచిన పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి, మంత్రి హరీశ్‌రావుకి కూడా జిల్లా పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. తనతోపాటు జిల్లా ఎన్నికల సమన్వయ బాధ్యతలు నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. గతంలో కంటే ఈ ఎన్నికలు భిన్నంగా జరిగాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైపు ప్రజలు నిలబడ్డారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాబోతోందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కాబోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, చింతనిప్పు కృష్ణచైతన్య, సమన్వయ కమిటీ సభ్యుడు డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ..

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పినపాక అభ్యర్థి రేగా కాంతారావు

- **కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు**
- **బీఆర్ఎస్ 'పినపాక' అభ్యర్థి రేగా కాంతారావు**

అశ్వాపురం, డిసెంబర్ 2: రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయంతోపాటు పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బీఆర్ఎస్ అశ్వాపురం మండల నాయకులు మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. అటు రాష్ట్రంలోనూ, ఇటు పినపాక నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెన్న అశోక్‌కుమార్, జగ్గారం, నెల్లిపాక సర్పంచ్‌లు సున్నం రాంబాబు, గొర్రెముచ్చు వెంకటరమణ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు లకావత్ రామారావు, నాయకులు పాటి చంద్రశేఖర్, ఐతం సత్యనారాయణ, చిన భద్రు, ఖాసీం, ఊకే వెంకటేశ్వర్లు, వల్లెపోగు రాము, ప్రదీప్, మేకల భాస్కర్, కాల్వ సంసోను తదితరులు పాల్గొన్నారు.

# తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

- **ఉదయం 8:30 గంటలకు మొదటి రౌండ్ కౌంటింగ్**
- **ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు**
- **కౌంటింగ్ ప్రక్రియలో 340 మంది అధికారుల విధులు**
- **మీడియా సమావేశంలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**
- **సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్, పెట్రోలింగ్: సీపీ**



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, చిత్రంలో సీపీ విష్ణు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 2: జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఈ కళాశాలలోనే జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను ఈ కౌంటింగ్ కేంద్రంలో భద్రపర్చినట్లు చెప్పారు. ఐదు నియోజకవర్గాలకు ఐదుగురు అబ్జర్వర్లను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందన్నారు. ఆదివారం ఉదయం 6 – 7 గంటల మధ్య స్ట్రాంగ్‌రూంల నుంచి ఈవీఎంలను బయటకు తీసుకొచ్చే ప్రక్రియ ఉంటుందన్నారు. 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. 8:30 గంటలకు మొదటి రౌండ్ లెక్కింపును ప్రారంభిస్తామన్నారు. ఖమ్మం నియోజకవర్గానికి 25 రౌండ్లు, పాలేరుకు 21, సత్తుపల్లికి 21, మధిరకు 20, వైరాకు 18 రౌండ్ల చొప్పున లెక్కింపులు ఉంటాయన్నారు. ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో 340 మంది అధికారులు విధులు నిర్వహిస్తాన్నారు. నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లను బట్టి రౌండ్లను ఏర్పాటు చేశామన్నారు.

**సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్, పెట్రోలింగ్: సీపీ**

కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా పోలీసు పికెంటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు సీపీ విష్ణు ఎస్ వారియర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో నిరంతరం పోలీసు పెట్రోలింగ్ కూడా కొనసాగుతుందన్నారు. ఫలితాల తరువాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకుగానీ, నిరసన కార్యక్రమాలకు గానీ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మొత్తం మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణ కొనసాగించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616